
# దేవుడి కథకి మానవుడి ముగింపు




యస్. కాశీవిశ్వనాధ్

ఇది ప్రేమ కథకాదు.

అయినా ఇందులో ఓ అమ్మాయి వుంది. ఆ అమ్మాయి కాళ్ళలో సంగీతానికి నర్తించే శక్తి వుంది. మెరుపుల్ని కళ్ళలో నిలుపుకుని కమ్మగా నవ్వే శక్తి వుంది.

అదిగో ఆ అమ్మాయే నా కథకి నాయిక.

నాయిక పేరు—రాణి!

ఆ రాణికి పదకొండు ఇళ్ళతోగూడిన ఓ చిన్న సామ్రాజ్యం వుంది. ఆ పదకొండు ఇళ్ళలో ఏ ఇంట్లో ఎప్పుడు ఏ భోజనం చేస్తుందో ఆమెకే తెలియదు.

ఇన్ని వున్న రాణికి వయసెంతో చెప్పలేదు కదూ—రాణి వయసు పదకొండు!

అవును. ఆమె వయసు పదకొండే!

అయితే పదకొండేళ్ళ అమ్మాయి చుట్టూ నా కథ ఎందుకు తిరిగిందని విజ్ఞులడగొచ్చు.

ఒకసారి, అంటే దాదాపు రెండేళ్ళ క్రితం నేను మా అక్కగారింటికి ఓ పని మీద వెళ్ళినప్పుడు రాణి తారసపడింది.

ఓ మధ్యాహ్నంవేళ మా అక్కయ్య గారి క్వార్టరు ముంగిట్లో నీడకోసం వేసిన కమ్మలపాక కింద కూర్చుని నాటకం రాసుకుంటున్నవేళ అల్లంత దూరాన పది పన్నెండుమంది జనంవున్న గుంపు మధ్య చకచక నృత్యం చేస్తున్న ఓ అమ్మాయి కనిపించింది.

అది శాస్త్రీయ నృత్యమని అనను—అలాగని పిచ్చివాడి దాట్లు అనిగూడా అన లేను.

ప్రేక్షకుడికి నేత్రపర్వంగా, హృదయ రంజకంగా కదులుతున్న అడుగులకి నృత్యమనే అంటాన్నేను.

ఓ అయిదు నిమిషాల తర్వాత ఆ గుంపులో నేనూ ఒకణ్ణి కాకతప్పనప్పుడు, నా ప్రవేశం ఎలా గమనించిందో ఏమో, రాణి వేస్తున్న అడుగులు ఆగిపోయి, తుపాకి శబ్దం విన్న పాలపిట్టలా రివ్వు మంటూ ఎటో పారిపోయింది. చుట్టూ జేరిన ఆడంగులుగూడా ఎవరి క్వార్టర్సు లోకి వారు వెళ్ళిపోయారు.

హృదయానందంకోసం వెళ్ళిన నేను, వారికి రసాస్వాదనకి భంగం కలిగించా నేమోనని సంశయపడుతూనే, ఆ సంశ యాన్ని సాయంత్రం టీ సమయంలో మా అక్కయ్యతో అంటే, "అదేం లేదు లేరా, రాణీ డేన్సు మాకు కాణీ ఖర్చులేని కాలక్షేపం. అది రోజూ అలా గెంతు తూనే వుంటుంది. మేం చూస్తూనే వుంటాం" అంది.

తర్వాత నేను మా అక్కనడిగి రాణి గురించి తెలుసుకున్న వివరాల సారాంశం ఇది.

రాణికి తల్లీతండ్రీ ఎవరో తెలీదట.

అక్కడున్న క్వార్టర్సులో ఎవరింట్లో నైనా జొరబడిపోగల స్వాతంత్ర్యంతో పాటు వారింట్లో అంట్లు తోమే బాధ్యత, అందుకు ప్రతిగా ఆ పూట కాసిన్ని మెతు కులు తినగలిగే హక్కు ఆమెకున్నాయి.

ఇంకా చాలా చాలా వివరాలు విన్నాను. అయితే ఇదేదీ, నా కలానికి కదలిక నేర్పర్చలేదు.

రాణి మూగది!

రాణి చెవిటిది!


ఈ రెండూ రెండూ నమ్మలేని నిజాలు—కానీ, కల్తీ లేని వాస్తవమే ఇది.

తెల్లగా, మెత్తగా వుండే సిల్కు దారాలతో నేసిన పత్రంలాంటి దేహంతో మెరిసిపోయే రాణి మూగది, చెవిటిది.

చెయ్యి తిరిగిన శిల్పకారుడు తనకోసం ప్రత్యేకించి తయారుచేసుకున్న బొమ్మ లాంటి రాణి మూగది, చెవిటిది.

భక్తులు సైతం భగవంతుణ్ణి నిందించే యీ వెలితి నన్ను బాగా కదిలించింది. రైలుపట్టాలమీద అడుగులో అడుగేసి నడవడంలో ఆనందం పొందే రాణి చెవు లకి రైలుకూతలే వినిపించకుండా కొన్ని సార్లు రైలుకింద పడబోయినప్పుడు—ఆమె చెవులకి ఏ వింత సంగీతం విన్పించి ఆ కాళ్ళనలా నర్తింపజేస్తు న్నాయి.

బహుశా ఆమె మనసులో ఆమెకు




మాత్రమే విన్పించే ఏదో ఓ సంగీతం మ్రోగుతుండాలి. మనసులోని సంగీతానికి మనిషి కదుల్తోంది.

ఆ మర్నాడు నా కోరికమీద మా అక్క రాణిని ఇంటికి పిల్చింది. నేను రాణిని డేన్సు చెయ్యమని బ్రతిమలాడాను. ఊఁహూ లాభంలేకపోయింది. సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది. రేడియో వేశాను. రాళ్ళను సైతం ఎగిరి గంతు వేయించే సంగీతం వినిపించింది. తనో ప్రశాంతమైన, నిశ్శబ్దమైన స్థలంలో ఒంటిగా వున్నట్టుగా కూర్చుందే తప్ప, రేడియోలోనించి ఓ సంగీతం వస్తున్నదన్న ధ్యాసే లేదామెకు.

"దీన్ని ఆడించడానికి కొకచే మందుంది—" అంటూ మా అక్క ఆ పొరుగు క్వార్టర్లో వున్న అమ్మాజీ అనే ఓ అమ్మాయిని పిల్చుకొచ్చింది. అమ్మాజీ గూడా రాణీ వయసుదే! అమ్మాజీ వచ్చి ముందు రాణీని పాడమంది—రాణి పాడలేదు.

"పాడకపోతే నీ జట్టుండను ఫో" అన్నట్టుగా సౌంజ్ఞచేసి బెదిరించింది అమ్మాజి. అంతే! రాణిని ఎక్కణ్ణించి ఏ ఆవేశం కదిలించిందోగాని తనకి తోచిన విధంగా ఓ పది నిమిషాలపాటు డేన్సుచేసి చేసి, చేస్తూనే ఏడుస్తూ అంతలోనే తుర్రుమంటూ బయటికి పారిపోయింది.

భగవంతుడు భక్తికి లొంగిపోయినట్టు రాణి స్నేహానికి లొంగిపోయింది.

"ఇలాంటి అమ్మాయిలకి డేన్సు నేర్పిస్తే చాలా బావుంటుంది కదరా?" అంది మా అక్క.

"ఎలా వీలవుతుందక్కా? రాణీ చెవికి ఏమీ వినబడదు. ఏ శబ్దమూ వినలేని రాణి ఎలా లయబద్ధంగా నాట్యంచెయ్యగలదు?" ఇది నా సమాధానం.

అయితే యీ సమాధానం ఆమెను సంతృప్తిపరిచిందేమోగాని నాలో మాత్రం చాలా అసంతృప్తిని రేపింది.

అక్కడున్న నాలుగురోజుల్లోను రాణి పట్ల నేను చూపించిన ఆసక్తిని చూసి

"చూడబోతే రాణీని ఏదో కథలో ఇరికించేసేటట్టున్నావే" అంది మా అక్క.

నేను రాసిన కథల్లో ఎప్పుడూ ఆ వయసు అమ్మాయి బ్రతకలేదు.

అయినా రాణి గురించి అంతవరకు నాకు తెల్సింది రాస్తే అది ఓ స్టేట్‌మెంట్ అనిపించుకుంటుంది గాని కథ అనిపించుకోదు.

కథకి ఓ మలుపు కావాలి.

రాణిచుట్టూ కథని తిప్పి ఏ మలుపు యివ్వాలి? అసలు రాణి నా కథలకి వస్తువు కాగలదా? ఈ రెండు ప్రశ్నలూ నేను విశాఖపట్నం తిరిగొచ్చేసిన చాన్నాళ్ళ వరకు నా మనసులో బ్రతికేయి.

మా అక్క రాసే వుత్తరాల్లో అప్పుడప్పుడు రాణి ప్రస్తావన వచ్చేది! "మీ డేన్సింగ్ హీరోయిన్ మొన్నామధ్య పెద్ద మనిషయితే, మా ఇంట్లోనే కూర్చోబెట్టాను" అంటూ వచ్చిన ఓ వుత్తరం నాకు విచిత్రమైన అనుభూతి కలిగించింది.

రాణి పుష్పవతయిందా?

అయితే, ఇంకా డేన్స్ చేస్తోందా? ఇంకా అందరిళ్ళల్లో అంట్లు తోముతోందా? ఇంకా లేడిపిల్లలా పరుగులు తీస్తోందా? ఇక నా సంశయాలు. ఆ వూరు


# అరుణా
# ఆంగ్ల భాషా స్వబోధిని

## అరువది రోజులలో ఆంగ్లభాషను అభ్యసించండి

తెలుగు తెలిసిన వయోజనులు, స్త్రీలు టీచరు సహాయము లేకుండానే ఇంటి వద్దనే వుండి ఇంగ్లీషు నేర్చుకోవడానికి, మా "అరుణా ఆంగ్ల భాషా స్వబోధిని" కల్పతరువు వంటిది. మీ స్నేహితులతో ఇంగ్లీషులో మాట్లాడుకోవడానికి, ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకోవడానికి, ఇంకెన్నో మీకు కావలసిన విషయాల్ని గురించి ఇందులో బొమ్మలతో సహా చక్కని తేలికైన ఉదాహరణలు వున్నాయి. మీ ఆంగ్ల భాషా విజ్ఞానము నిర్దుష్టంగాను, ధారాళంగాను వుండేందుకు వీలుగా పూర్తి గ్రామరు పొందుపరుచబడివుంది. హైస్కూలు విద్యార్థులకు కూడా ఇది మిక్కిలి ఉపయోగకరమైనది:

త్రివర్ణ ముఖచిత్రముగల జాకెట్‌తో—క్యాలికో బైండు—దాదాపు 700 పేజీలు

**వెల: రూ. 10-00. పోస్టేజి రూ. 2-75. నేడే మీ కాపీకి M. O. చేయండి.**

V P P. పద్ధతి లేదు!

**SREE ARUNA BOOK HOUSE (J)**
**1/48, Narayana Mudali St., MADRAS-1**

వెళ్ళి రాణిని చూడాలని దాదాపు నెలకో సారైనా అనిపించినా, దాదాపు ఏడాది న్నరవరకు వెళ్ళడం పడలేదు.

ఈ సారైనా వెళ్ళకపోయేవాణ్ణి— వెంకట్ బలవంతం చెయ్యకపోతే!

వెంకట్ ఓ ప్రఖ్యాత తెలుగు సినిమా సంస్థలో సహకార దర్శకుడి హోదాలో చాలా అనుభవం గడించాడు. ఇప్పుడు వాడికి సొంతంత్రంగా ఓ చిత్రం డైరెక్ట్ చేసే అవకాశమొచ్చి ఓ వినూత్న పంథాలో వున్న కథ కోసం వెదుకుతూ మా వూరొచ్చి నన్నడిగితే నేను మాటల సందర్భంలో రాణిని గురించి చెప్పాను. రాణిని ఆలంబనం చేసుకుని ఓ కథని బెంగాలీ చిత్రం మాదిరి తెలుగు చిత్రం తీయడానికి అనువుగా చెప్పాను. ఆ కథ వాడికి నచ్చినట్టే అనిపించింది కాబోలు 'ముందా అమ్మాయిని చూపించు" అని పట్టుబడితే వున్నపళంగా ఆ వూరికి బయలుదేరాం.

అకస్మాత్తుగా వచ్చిన నన్నూ, మా వెంకట్‌ని చూసి అక్క ముందు ఆశ్చర్య పోయినా వెంటనే ఆతిధ్యం ఇచ్చింది.

మేం వచ్చిన పని చెప్పి రాణిని వెంటనే పిలిపించమన్నాను.

దానికి మా అక్క "నెల్రోజుల్నుంచి నీకీ విషయం వుత్తరంలో రాద్దామను కుంటూనే మర్చిపోతున్నాను" అంటూ ఆ విషయాన్ని చెప్పింది.

ఆ విషయంలోవున్న విషాదం ఒక్క క్షణం నా గుండెని స్థంభింప జేసింది. నాకేగాదు మనసున్న ప్రతి మనిషి ఆ అనుభూతికి లోనవుతాడేమో!

రాణి చచ్చిపోయింది!

లేత ఎండ వెలుగులా మెరిసి, ఇంద్ర ధనుస్సులా అందాలీనే రాణి చచ్చి పోయింది.

రాణి రైలుక్రిందపడి చచ్చిపోలేదు.

రాణి జబ్బుచేసి చచ్చిపోలేదు.

మరెలా చచ్చిపోయింది?

రాణి గర్భవతిగా మరణించింది!!

ఆ అందాల బొమ్మని ఏ కసాయి గుండె అలా బ్రద్దలు చేసిందో ఎవరికీ తెలియదట — ఏడునెలలు గర్భాన్ని మోసిన రాణికీ ఆ పాపాన్ని ఆమెలో ఎవరు ప్రతిష్టించారో తెలియదట.

నొప్పులొచ్చేదాకా బరువుగా తిరుగుతూ, మెల్లిగా కదుల్తూ చల్లగా నవ్వినా, ఏడునెల్లకే నెప్పులొచ్చి, ఆ బాధలో మెలికలు తిరిగి తిరిగి—ఈ ప్రపంచం నించి ఎక్కడికో ఎగిరిపోయింది రాణి.

"ఈకథ నీ సినిమాకి పనికొస్తుందా?" అన్నాన్నేను వెంకట్‌తో.

"పనికిరాదు. నా కథలోని రాణిని అంతర్జాతీయ నాట్యసుందరిగా మలుచుదా మనుకున్నాను కానీ ..."

అవును! నేనో, మరో రచయితో రాసిన కథలోని పాత్రనైతే మా ఇష్టాను వర్తంగా మార్చుకోవచ్చు.

కానీ—యిది దేవుడు రాసిన కథ. ఇటువంటి దారుణమైన ముగింపుల్ని ఆ దేవుడు తప్ప మరో మనసున్న రచయిత ఇవ్వలేడేమో!

అందుకే దేవుడనేవాడు ఎప్పుడైనా కనిపిస్తే "దేవుడా! నువ్వు రాసే కథల ముగింపుల్ని మా కొదిలెయ్" అని అడగాలనుంది.

***